ప్రహరీ కూల్చివేత

కవాడిగూడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రోడ్డుకు అడ్డంగా ఉన్న ఫుట్‌పాత్ ప్రహరీని హైడ్రా అధికారులు శనివారం కూల్చివేశారు. ఈ విషయమై ఎక్స్ వేదికగా యువకుడు ఫొటోలతో సహా ఫిర్యాదు మేరకు చర్యలు చేపట్టారు. కవాడిగూడ డివిజన్‌లోని ఎల్‌బీనగర్ వద్ద నిర్మించిన డబుల్ బెడ్ రూం ఇళ్ల ప్రహరీని ఆనుకొని ఉన్న ఫుట్‌పాత్ గోడ కూల్చివేశారు. అనధికారిక ఫెన్సింగ్ సైతం అధికారులు తొలగించారు. కవాడిగూడ మెయిన్‌రోడ్ నుంచి ఎల్‌బీనగర్, కిందిబస్తీ, బాంబే బిల్డింగ్ ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల రాకపోకలు సాఫీగా ముందుకు సాగాలా చర్యలు తీసుకున్నారు.

అగ్రవర్ణాల్లోని పేదలకు
రాజీవ్ యువ వికాసం వర్తింపజేయాలి

కవాడిగూడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాజీవ్ యువ వికాస పథకాన్ని అగ్రవర్ణ పేదయువతకు వర్తింప చేయాలని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్దన్ రెడ్డి కోరారు. కవాడిగూడలోని తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు వేల కోట్లతో రాష్ట్రంలోని ఎస్సీ, ఎస్టీ బీసీ మైనార్టీ వర్గాల యువతకు స్వయం ఉపాధి కల్పించడానికి ప్రారంభించిన రాజీవ్ యువ వికాసం పథకంలో అగ్రవర్ణ పేద యువతను విస్మరించడం బాధాకరమని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి ఈ పథకంలో ఆర్థికంగా వెనకబడిన అగ్రవర్ణాలకు కూడా అవకాశం కల్పించాలన్నారు.



రామచంద్రరావును సన్మానిస్తున్న నిర్వాహకులు

సుస్థిర పాలనకు 'ఒకే దేశం ఒకే ఎన్నిక'

చిక్కడపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దేశం అంతా పార్లమెంటుకు, శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహిస్తే నిధులను పొదుపు చేయవచ్చునని సుప్రీంకోర్టు న్యాయవాది నారపరాజు రామచంద్రారావు అన్నారు. శనివారం త్యాగరాయగానసభలో ఒక దేశం ఒకే ఎన్నిక అంశంపై ప్రకాశం అధ్యయన అభివృద్ధి సంస్థ ట్రస్ట్ ఆధ్వర్యంలో మద్దతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక దేశం ఒకే ఎన్నికవల్ల అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేసే అవకాశం ఉందన్నారు. రాష్ట్ర, కేంద్రప్రభుత్వాలు సుస్థిరతతో పాలన చేసే వీలు కలుగుతుందని అభిప్రాయపడ్డారు. సంస్థ చైర్మన్ డా. పి. మోహన్‌రావు మాట్లాడుతూ టంగుటూరి ప్రకాశం గ్రామఅభ్యుదయం, గ్రామ స్వరాజ్యం కోసం విశేష కృషి చేశారని తెలిపారు.

రిజిస్ట్రేషన్లకు స్లాట్ బుకింగ్

● పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఎస్‌ఆర్‌వోలు ఎంపిక

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): సబ్ రిజిస్ట్రార్ ఆఫీసు(ఎస్ఆర్‌వో)ల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రవేశపెట్టాలని స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ భావిస్తోంది. ఉగాదిలోగా పైలెట్ ప్రాజెక్టు కింద 17 ఆఫీసుల్లో ఈ విధానాన్ని ప్రారంభించాలని సన్నాహాలు చేస్తోంది. ఆ తర్వాత రాష్ట్రవ్యాప్తంగా 148 ఎస్ఆర్‌వోల్లో ఈ విధానాన్ని తీసుకురానున్నారు. పైలెట్ ప్రాజెక్టు కింద గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఉన్న ఆరు ఎస్‌ఆర్‌వోలను అధికారులు ఎంపిక చేశారు. ఇందులో హైదరాబాద్ జిల్లాలోని చిక్కడపల్లి, ఆజంపురా, రంగారెడ్డి జిల్లాలోని ప్రాంతీయ కార్యాలయం(ఆర్‌ఓ), శంషాబాద్.. మేడ్చల్ జిల్లాలోని కుత్బుల్లాపూర్, మేడ్చల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. ఆయా కార్యాలయాల్లో ఉగాది నుంచి రోజుకు 48 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగేలా వినియోగదారులకు 48 టైమ్ స్లాట్లను అందుబాటులోకి తేనున్నారు. స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు చలానాలను ఆన్‌లైన్‌లోనే చెల్లించి ఆ డాక్యుమెంట్లు ప్రింట్ తీసుకుని ఎస్‌ఆర్‌వోకు వెళితే 10 నిమిషాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తవుతుంది. అయితే సంతకాలకు బదులు ఎలక్ట్రానిక్ సిగ్నేచర్ పద్ధతిని అవలంబించాలని ఉన్నతాధికారులు భావిస్తున్నారు.

ముగ్గురు పిల్లలతో సహా తల్లి అదృశ్యం

బర్కత్‌పుర, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): భర్తతో గొడవ పడి పుట్టింటికి చేరిన అనంతరం ఇక్కడ నుంచి ఓ మహిళ తన ముగ్గురు పిల్లలను తీసుకుని కనిపించకుండాపోయింది. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిలక్ నగర్‌లో నివాసముంటున్న భానుమతి కుమార్తె లావణ్యను మెదక్‌కు చెందిన నర్సింహులుకు ఇచ్చి వివాహం చేశారు. వీరికి ముగ్గురు సంతానం ఉన్నారు. అయితే భర్తతో గొడవ పడిన ఆమె ఈనెల 14న రాత్రి పిల్లలను వెంట తీసుకొని పుట్టింటికి చేరింది. శుక్రవారం సాయంత్రం భర్త వద్దకు వెళ్లమని తల్లి కోరగా తాను వెళ్లనని చెప్పింది. కాగా, శనివారం ఉదయం ముగ్గురు పిల్లలతో సహా లావణ్య కనిపించకుండా పోయింది. దీంతో ఆందోళన చెందిన తల్లి భానుమతి పరిసర ప్రాంతాలు బంధువుల ఇళ్లల్లో వెతికినా వారి ఆచూకీ లభించలేదు. దీంతో కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో శనివారం ఫిర్యాదు చేసింది. మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపారు.

బాలికా సదన్ నుంచి అక్కాచెల్లెళ్ల పరార్

బర్కత్ పుర మార్చి 22(ఆంధ్రజ్యోతి): బాలికా సదన్ నుంచి ఇద్దరు అక్కాచెల్లెళ్లు పారిపోయారు. ఈ సంఘటన నింబోలి అడ్డలో జరిగింది. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ సుభాష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈ బాలికా సదన్‌లో వరంగల్‌కు చెందిన ఇద్దరు బాలికలు అక్కాచెల్లెళ్లు ఉంటున్నారు. శనివారం ఉదయం 6 గంటలకు సిబ్బంది తనిఖీలు చేయగా ఈ ఇద్దరు కనిపించలేదు. లోపల ఉన్న ఒక చెట్టు ఎక్కి గోడ దూకి పారిపోయినట్లు సూపర్‌వైజర్ కళ కాచిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని, సీసీ కెమెరా ఫుటేజీని పరిశీలిస్తున్నట్లు సుభాష్ తెలిపారు.

బంగారు ఆభరణాలు, నగదు చోరీ

బర్కత్‌పురా, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): రైలు ప్రయాణికుడి బ్యాగులోని ఉన్న నగలు, నగదు తస్కరించారు. ఈ సంఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. తన కుటుంబ సభ్యులతో కలిసి విశాఖపట్నంకు చెందిన వెంపటి మోహన మురళీకృష్ణ విశాఖపట్నం - మహబూబ్ నగర్ ఎక్స్‌ప్రెస్ రైల్లో కాచిగూడ వెళ్తున్నారు. డోర్నకల్ రైల్వే స్టేషన్ సమీపంలో సీటు కింద ఉన్న బ్యాగ్ జిప్పు తెరిచి ఉంది. గమనించగా ఇందులో ఉండాల్సిన 3 తులాల మంగళసూత్రం, రూ. 48 వేలు కనిపించలేదు. దీంతో శనివారం బాధితుడు కాచిగూడ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని డోర్నకల్ రైల్వే పీఎస్‌కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

వీడిన మిస్టరీ

● బాలిక అదృశ్యం కేసు.. 9 గంటల్లోపు ఛేదించిన పోలీసులు

హైదరాబాద్ సిటీ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యం కేసు మిస్టరీని పోలీసులు 9 గంటల్లోపు ఛేదించారు. లైంగిక దాడికి యత్నించిన యువకుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మారేడ్‌పల్లి ఇన్‌స్పెక్టర్ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం... మల్కాజిగిరి ప్రాంతంలో నివాసముంటున్న దంపతుల కుమార్తె మెదక్‌లో అమ్మమ్మ వద్ద ఉంటోంది. ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసింది. కాగా తల్లిదండ్రుల వద్దకు బయలుదేరింది. జూబ్లీ బస్టాండ్‌కు చేరుకున్న బాలికను మెదక్‌లో పరిచయమైన యువకుడు మాయమాటలు చెప్పి తన వెంట తీసుకెళ్లాడు. ఎంతకీ యువతి ఇంటికి చేరకపోవడంతో తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రంగంలోకి దిగిన వారు తమకు లభించిన సీసీ ఫుటేజీని తల్లిదండ్రులకు చూపించారు. వారిచ్చిన సమాచారంతో మెదక్ సమీపంలో ఉన్న గ్రామానికి చెందిన యువకుడిగా గుర్తించారు. స్నాప్‌చాట్‌లో అతడి ప్రొఫైల్ వివరాలు సేకరించారు. ఆ గ్రామ సర్పంచ్‌ను సంప్రదించి యువకుడి బాబాయ్ సెల్ నంబర్ తీసుకున్నారు. కాల్ చేసి యువకుడు వద్ద ఉన్న మొబైల్ నంబర్ ఆధారంగా దమ్మాయిగూడలో బాలిక ఉన్న ప్రాంతాన్ని గుర్తించారు. వెంటనే అక్కడకు చేరుకున్నారు. ఈ సందర్భంగా తనపై అత్యాచార యత్నానికి ప్రయత్నించాడని బాలిక వారికి తెలిపింది. దీంతో యువకుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. అతడ్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. అయితే కేసును 9 గంటల వ్యవధిలోనే ఛేదించిన మారేడ్‌పల్లి పోలీసులను ఉన్నతాధికారులు అభినందించారు.

● కనీస వేతనాలు ఇవ్వాలి

కవాడిగూడ, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): కనీస వేతనాలు ఇవ్వాలని కేంద్ర, రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. శనివారం తెలంగాణ కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద ఆల్ ట్రేడ్ యూనియన్ నేతలు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నేతలు మాట్లాడారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీస వేతనాల చట్టం ప్రకారం వేతనాలు పెంచాల్సి ఉందని వారు అన్నారు. ధర్నాలో వివిధ కార్మిక సంఘాల నేతలు, కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


అభివాదం చేస్తున్న కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల నేతలు

● భగత్‌సింగ్ బాటలో మేమంతా..

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : భగత్‌సింగ్ బాటలో నేటి తరం యువతీ, యువకులు పయనించాలని తెలంగాణ ప్రజా సాంస్కృతిక వేదిక అధ్యక్షుడు భూపతి వెంకటేశ్వర్లు సూచించారు. శనివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీపీఎస్‌కే ఆధ్వర్యంలో భగత్‌సింగ్ 94వ వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు భగత్‌సింగ్ వేషధారణతో ప్లకార్డులు చేతబూని భగత్‌సింగ్ బాటలో మేమంతా అంటూ ప్రదర్శన నిర్వహించారు. దేశం కోసం తామంతా పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. నిర్వాహక సంస్థ నగర కన్వీనర్ జి.నరేష్, నాయకులు రాజయ్యగౌడ్, వరప్రసాద్‌రెడ్డి, పలు పాఠశాలల విద్యార్థులు, టీచర్లు పాల్గొన్నారు.


భగత్‌సింగ్ వేషధారణలో చిన్నారులు

అభివృద్ధికి సహకారం అందిస్తాం

● కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి
● పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు
● హాజరైన ఎంపీ లక్ష్మణ్, ప్రజాప్రతినిధులు

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ నియోజకవర్గం అభివృద్ధికి సహకారం అందిస్తామని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి అన్నారు. అభివృద్ధి కార్యక్రమాల్లో రాజకీయాలకు తావు ఉండకూడదని పేర్కొన్నారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని నాగమయ్యకుంటలో రూ. 44 లక్షలతో నూతనంగా నిర్మించే డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ కె.రవిచారి, బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, బస్తీ అధ్యక్షుడు ఎ.సాయిలుతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. నాగమయ్యకుంటలో నూతనంగా నిర్మిస్తున్న డ్రైనేజీ పైప్‌లైన్‌తో శాశ్వతంగా డ్రైనేజీ సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఈ పనులను ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వేగవంతంగా పూర్తి చేయాలని జలమండలి అధికారులకు సూచించారు. వేసవిలో నీటి ఎద్దడి తలెత్తకుండా జలమండలి చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం పట్ల బీజేపీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అనంతరం ఎంపీ డా.కె.లక్ష్మణ్ మాట్లాడుతూ నాగమయ్యకుంటలో తాను ఎమ్మెల్యేగా పనిచేసిన రెండు సమయాలలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. బీజేపీ నాయకులు పి.సాయికృష్ణయాదవ్, శేషసాయి, మేకల సారంగపాణి, విన్ను ముదిరాజ్, వెంకటేష్, గడ్డం నవీన్, బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, కె.సురేందర్, మాధవ్ పాల్గొన్నారు.


డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, ఎంపీ లక్ష్మణ్, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రవిచారి

శ్మశాన వాటికలలో సదుపాయాలు..

ముషీరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : నగరంలో శ్మశాన వాటికలలో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తానని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి తెలిపారు. నగరంలో శ్మశాన వాటికల కొరత తీవ్రంగా ఉందన్నారు. శ్మశాన వాటికల్లో సదుపాయాల కల్పనకు జీహెచ్ఎంసీ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. శనివారం సాయంత్రం ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో హిందూ శ్మశాన వాటికలో రూ. 32 లక్షలతో అభివృద్ధి పనులను ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌లతో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడారు. శ్మశాన వాటికలపై ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి వాటి అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక తయారు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీజేపీ ముషీరాబాద్ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, బీజేపీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్, నాయకులు పూస రాజు, కంచికుమార్, కుషాల్ గౌడ్, శ్మశాన వాటిక నాయకులు బాల్‌రాజ్‌యాదవ్, తహసీల్దార్ రాణాప్రతాప్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని మతాల పండుగలకు ప్రాధాన్యం ఇచ్చాం

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

గోల్నాక, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో అన్ని మతాల పండుగలకు సముచిత ప్రాధాన్యం ఇచ్చామని, గౌరవంగా జరుపుకొనేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటన్నింటినీ విస్మరించిందన్నారు. శనివారం గోల్నాక డివిజన్ జిందా తిలిస్మాత్‌నగర్‌లోని మసీద్‌ను ఆయన సందర్శించి రంజాన్ మాసం శుభాకాంక్షలు తెలిపారు. మసీద్ పెద్దలకు చెత్తాచెదారం వేసేందుకు కవర్లను అందజేశారు. కేసీఆర్ పాలనలో బోనాలు, బతుకమ్మ, రంజాన్, క్రిస్మస్ పండుగలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిందన్నారు. ఆయా మతాల వారికి ప్రభుత్వ పక్షాన వివిధ పథకాలతో చేయూత అందించిందన్నారు. ఈ సంస్కృతి దేశంలోనే ఆదర్శంగా నిలిచిందన్నారు. నాటి కేసీఆర్ పాలన, నేటి కాంగ్రెస్ పాలనను ప్రజలు బేరీజు వేసుకొని మళ్లీ బీఆర్ఎస్‌నే కోరుకుంటున్నారన్నారు. ఆపార్టీ ఎన్నో హామీలిచ్చి అధికారంలోకి వచ్చి వాటిని సవ్యంగా అమలు చేయలేదన్నారు. ఏడాదిన్నరలోనే ప్రజాగ్రహాన్ని ప్రభుత్వం చవిచూస్తోందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎ.సురేష్‌గౌడ్, జీహెచ్ఎంసీ అధికారులు, మజీద్ పెద్దలు, మైనార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



జిందాతిలిస్మాత్‌నగర్‌లోని మసీద్ వద్ద ముస్లిం పెద్దలకు కవర్లను అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

వైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్యే ముఠా గోపాల్

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. శనివారం అడిక్‌మెట్ డివిజన్ విద్యానగర్ ఎస్‌ఆర్‌టీలో ఉచిత వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. ధనార్జనే ధ్యేయంగా కాకుండా కార్పొరేట్ ఆస్పత్రులు మురికివాడల ప్రాంతాల్లోని పేదలకు కూడా ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించాలన్నారు. డాక్టర్లు పావని, అర్జున్, మన్మోహన్‌లు పరిసర ప్రాంతాల ప్రజలకు చెందిన 200 మందికి పరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ యువజన నాయకుడు ముఠా జైసింహ, అడిక్‌మెట్ డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్, ఎస్ఆర్‌టీ కాలనీ అధ్యక్షుడు గిరి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే గోపాల్‌కు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించాలి

● సమాజ్‌వాదీ పార్టీ న్యాయవాదుల ఫోరం జాతీయ అధ్యక్షుడు కన్వాయజ్ఞ

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా కులగణన నిర్వహించి జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు అమలు చేయాలని సమాజ్‌వాదీ పార్టీ న్యాయవాదుల ఫోరం జాతీయ అధ్యక్షుడు క్రిషన్ కన్వాయజ్ఞ అన్నారు. అప్పుడే అన్ని వర్గాలకు సామాజిక న్యాయం జరగడంతోపాటు దేశాభివృద్ధి సాధిస్తుందని పేర్కొన్నారు. శనివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో ఉత్తర భారతీయ సమాజ్ సేవా సంఘ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ప్రసంగించారు. పేదల హక్కులను కాలరాస్తూ రాజ్యాంగాన్ని మార్చే ప్రయత్నాన్ని పాలకులు చేస్తున్నారని ఆరోపించారు. దళితులు, బలహీనవర్గాల ప్రజలు ఏకమై కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై ఐక్యఉద్యమాలు నిర్వహించాలన్నారు. దేశంలో ఎన్నో రకాల భాషలు ఉన్నా మనమంతా ఒక్కటే అని ప్రతీఒక్కరు గుర్తించుకోవాలన్నారు. సదస్సులో ఉత్తర భారతీయ సమాజ్ సేవా సంఘ్ అధ్యక్షుడు రవికుమార్, సభ్యులు వంశీ కృష్ణ, తాటికొండ వెంకటరాజయ్య, మల్లేష్‌రావు, మున్నాయాదవ్, కమిలేష్, పురుషిత్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కన్వాయజ్ఞ

● సమస్యల పరిష్కారంతోనే గుర్తింపు

ముషీరాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యలు పరిష్కారంతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ పేర్కొన్నారు. శనివారం ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ ఇంటికి ఆయన వెళ్లారు. ఈ సందర్భంగా కార్యకర్తలతో కలిసి ఆయన సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ అభివృద్ధి, ప్రజా సంక్షేమ నిర్వహణలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు ముందు వరసలో ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ముషీరాబాద్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడు కంచికుమార్, నాయకులు రమేష్‌రామ్, జమల్‌పురి నందు, అనిల్‌కుమార్, కుషాల్ గౌడ్, అజయ్‌గుప్తా, సత్యనారాయణ, ఆయూష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయను సన్మానిస్తున్న ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్

● మత సామరస్యానికి ప్రతీక 'ఇఫ్తార్'

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : ఇఫ్తార్ విందులు మత సామరస్యానికి ప్రతీక అని మాజీ ఎంపీ వి.హనుమంతరావు అన్నారు. ఖైరతాబాద్ జిల్లా యూత్ కాంగ్రెస్ కార్యదర్శి సయ్యద్ ఆలీ ఆధ్వర్యంలో బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని రహత్‌నగర్‌లో శనివారం రాత్రి జరిగిన ఇఫ్తార్ విందుకు కాంగ్రెస్ మైనారిటీ నాయకుడు ఫిరోజ్‌ఖాన్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్‌యాదవ్, కార్యదర్శి శంభుల శ్రీకాంత్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ నగర అధ్యక్షుడు మోతె రోహిత్, మాజీ కార్పొరేటర్ పులిజగన్, మైనారిటీ సెల్ చైర్మన్ జమీర్, నాయకులు కోటం అనిల్ తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో మాజీ ఎంపీ వీహెచ్ హనుమంతరావు, మైనారిటీ నాయకుడు ఫిరోజ్‌ఖాన్ తదితరులు

సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి

చిక్కడపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా కృషి చేస్తానని రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఎం.అర్విందకుమార్‌యాదవ్ అన్నారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్ లక్ష్మీగణపతి దేవాలయం చైర్మన్ మారిశెట్టి నర్సింగ్‌రావు ఆధ్వర్యంలో శనివారం గాంధీనగర్ డివిజన్ ఆంధ్రాకేఫ్ వద్ద పేదలకు పండ్ల పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందన్నారు. ఇప్పటికే 50 వేలకుపైగా ఉద్యోగాలు ఇచ్చిందని వివరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శీలం సత్యనారాయణ, గుర్రం శంకర్, జయేందర్‌బాబు, జగదీశ్, మోహన్‌రెడ్డి, అభిషేక్, హఫీజ్, సాయిరామ్, విడి కృష్ణ, దినేష్, కిట్టు, బాబురావు, భాస్కర్, అస్లమ్, మేడి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రేక్షకరంజకంగా పద్యనాటక ప్రదర్శన

చిక్కడపల్లి, మార్చి 22 (ఆంధ్రజ్యోతి): వ్యాస కళాక్షేత్రం ఆధ్వర్యంలో ప్రపంచ నాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని త్యాగరాయగానసభలో శనివారం శ్రీకృష్ణరాయబారంలోని శయన దృశ్యం, కర్ణ సందేశం ఘట్టం, రామాంజనేయ యుద్ధాన్ని కళాకారులు ప్రేక్షకరంజకంగా ప్రదర్శించారు. కృష్ణుడిగా కిషోర్‌కుమార్, దుర్యోధనుడిగా శ్రీనివాస్, అర్జునుడిగా దొంతి జంగయ్యగౌడ్, కృష్ణుడిగా వేదవ్యాస వెంకటేష్‌గౌడ్‌లు నటించి సభికులను ఆకట్టుకున్నారు. అనంతరం జరిగిన సమావేశంలో కళాకారులను అభినందించి సత్కరించారు.

ట్రావెల్ టికెట్ల పేరుతో మోసం

పంజాగుట్ట, మార్చి22(ఆంధ్రజ్యోతి): ట్రావెల్ టికెట్ల పేరుతో ఓ నృత్యకళాకారిణిని మోసగించారు. ఈ సంఘటన పంజాగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో శనివారం వెలుగులోకి వచ్చింది. గతేడాది ఏప్రిల్‌లో తన బృందంతో కలిసి బాలీ వెళ్లేందుకు ఢిల్లీకి చెందిన ట్రావెల్ ఏజెంట్ మోహిత్‌ను బేగంపేట.. కుందన్‌బాగ్‌కు చెందిన కూచిపూడి నృత్య కళాకారిణి సంప్రదించింది. విమానం టికెట్ల కోసం రూ.7.71 లక్షలు అతనికి ఇచ్చింది. రోజులు గడుస్తున్నా టికెట్లు ఇవ్వక పోగా చుట్టూ తిప్పించుకుంటున్నాడు. దీంతో అనుమానం వచ్చి గట్టిగా నిలదీస్తే అతని నుంచి ఎలాంటి సమాధానం లేదు. దీంతో మోసపోయానని గ్రహించిన ఆమె శనివారం పంజాగుట్ట పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.


రాంనగర్ రామాలయం నూతన కమిటీ చైర్మన్, ధర్మకర్తలతో ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్ తదితరులు

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

● ఎంపీ అనిల్‌కుమార్‌యాదవ్

రాంనగర్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి) : దేవాలయాల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్ యాదవ్ తెలిపారు. బడ్జెట్‌లో దేవాదాయ శాఖకు సీఎం రేవంత్‌రెడ్డి తగిన నిధులను కేటాయించారని తెలిపారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని రాంనగర్ రామాలయం నూతన చైర్మన్, ధర్మకర్తల ప్రమాణ స్వీకారం శనివారం జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్‌గా వి.ఆనంద్ ముదిరాజ్, ధర్మకర్తలుగా జి.మీనా, గోవర్ధన్‌రెడ్డి, రాంచందర్, యాదగిరి, ప్రశాంత్‌లతో ఎంపీ ఎం.అనిల్‌కుమార్‌యాదవ్, దేవాదాయ శాఖ సూపరింటెండెంట్ అండాళు ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు రావి వెంకటరెడ్డి, ఆర్.కల్పనాయాదవ్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి ఎం.అరవిందకుమార్‌యాదవ్, నాయకులు జీ.ఎన్.కేశవ్, వరదరాజు, కర్ణం సురేష్, విజయ్‌యాదవ్, తిరుమల్, శ్రీకాంత్‌గౌడ్, పెండెం శ్రీనివాస్‌యాదవ్, లింగంగుప్తా, వెంకటేష్. బీఆర్ ఎస్ రాష్ట్ర నాయకులు ఎం.నాగేష్ ముదిరాజ్, అస్లాం, చిట్టి తదితరులు పాల్గొన్నారు.